మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్

ఖైరతాబాద్, జూన్ 4 : ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా మద్యం అమ్మకాలను నిషేధించగా, ఓ వ్యక్తి అక్రమంగా మద్యం అమ్ముతూ పట్టుబడ్డాడు. ఖైరతాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఖైరతాబాద్‌కు చెందిన అంబాజి బిరాదర్ స్థానికంగా ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. కౌంటింగ్ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ మద్యం అమ్మకాలపై నిషేధం విధించగా, షాపులు మూతపడ్డాయి. అయితే ఖైరతాబాద్ రైల్వే గేటు రోడ్‌లో వివిధ బ్రాండ్‌లకు చెందిన మద్యాన్ని సంచిలో పెట్టుకొని విక్రయిస్తున్నాడు. గుర్తించిన పోలీసులు అతడిన అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

యువకుడు మృతి

కాచిగూడ, జూన్ 4: రైలెక్కుతుండగా జారిపడి యువకుడు మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వేస్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణాచారి తెలిపిన వివరాల ప్రకారం.. సిద్ధిపేటలోని వర్గల్ ప్రాంతానికి చెందిన కె.సంజీవ డెలివరీబాయ్. సీతాఫల్‌మండీ రైల్వేస్టేషన్‌లో ఫలక్‌నుమా-సికింద్రాబాద్ ఎంఎంటీఎస్ రైలు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారిపడి సంజీవ అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

'చంద్రబాబుకు శుభాకాంక్షలు'

మణికొండ,జూన్ 4 : ఏపీలో భారీ మెజార్టీ సాధించి గెలుపొందిన నారా చంద్రబాబు నాయుడికి హార్థిక శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజా సంక్షేమమే ప్రధాన ఎజెండాగా పరిపాలనను సాగించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. రెండు రాష్ట్రాల్లో సత్సంబంధాలను ఎప్పటిలాగే కొనసాగిస్తారని కోరుకుంటున్నామన్నారు. భారీ మెజార్టీతో మరోసారి ఆంధ్రప్రజలకు సేవ లందించేందుకు ముందుకు వచ్చిన చంద్రబాబునాయుడికి ప్రజల అండదండలు ఎల్లప్పుడూ ఉండాలని కోరారు.

రాష్ట్ర గీతంలో సాయుధ రైతాంగ

పోరాట ప్రస్తావన లేకపోవడం బాధాకరం

బంజారాహిల్స్,జూన్ 4: తెలంగాణ రాష్ట్ర గీతంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం గురించి ప్రస్తావన లేకపోవడం బాధాకరమని సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ అమరవీరుల స్మారకట్రస్ట్ అధ్యక్షుడు సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. ప్రముఖ కమ్యూనిస్టు నేత రావి నారాయణ రెడ్డి 118వ జయంతిని పురస్కరించుకుని బంజారాహిల్స్ రోడ్ నెం 12లోని ఎమ్మెల్యే కాలనీలో ఉన్న రావి నారాయణరెడ్డి ఆడిటోరియం వద్ద తెలంగాణ అమరవీరుల ట్రస్ట్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ అమరవీరుల స్మారకట్రస్ట్ అధ్యక్షుడు సురవరం సుధాకర్‌రెడ్డి, సీపీఐ నారాయణ, చాడ వెంకట్‌రెడ్డి, పల్లా వెంకటరెడ్డి, ఈటీ, నర్సింహ, కందిమళ్ల ప్రతాప్‌రెడ్డి తదితరులు రావి నారాయణరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సురవరం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ..నిజాం నిరంకుశ పాలనకు. రజాకార్లకు వ్యతిరేకంగా మక్దుం మొహియునుద్దీన్. బద్దం ఎల్లారెడ్డి తదితర నేతలతో కలిసి గెరిల్లా యుద్ధాలు ప్రారంభించి వారి వెన్నులో చలిపుట్టించిన ఘనత రావినారాయణరెడ్డికి దక్కుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకల్లో తెలంగాణ సాయుధ పోరాట యోధులను స్మరించుకోకపోవడం. రాష్ట్ర గీతంలో తెలంగాణ సాయుధ పోరాటం గురించి ప్రస్తావన లేకపోవడం బాధను కలిగించిందన్నారు. అధికారిక గీతంలో ఉన్నా లేకపోయినా తెలంగాణ సాయుధ పోరాటం ప్రజల హృదయాల్లో శాశ్వతంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా సీపీఐ నారాయణ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా సాయుధ రైతాంగ పోరాటాల వార్షికోత్సవాలను అధికారికంగా జరపకపోవడంతో పాటు దశాబ్ది ఉత్సవాల్లో కూడా రావి నారాయణరెడ్డిలాంటి వీరుల చరిత్రను ప్రస్తావించలేదన్నారు.

బంజారాహిల్స్ రోడ్ నెం 12లోని రావి నారాయణరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు

హిమాయత్‌నగర్‌లోని మఖ్దుం భవన్‌లో రావి నారాయణరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

రావి నారాయణరెడ్డి సేవలు మరువలేనివి

హిమాయత్‌నగర్: నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి కమ్యూనిస్ట్ పార్టీకి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు రావి నారాయణరెడ్డి అందించిన సేవ లు మరువలేనివని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్యపద్మ అన్నారు. రావి నారాయణరెడ్డి 118వ జయంతి సందర్భంగా మంగళవారం హిమాయత్‌నగర్‌లోని మఖ్దుం భవన్‌లో ఆయన చిత్ర పటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలన, భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం ఆనాడు జరిగిన సాయుధ పోరాటంలో రావి నారాయణరెడ్డి కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. ఆ పోరాటంతోనే హైదరాబాద్ భారత్‌లో విలీన మైందన్నారు. కమ్యూనిస్ట్ పార్టీ నిర్మాణం కోసం ఎంతో కృషి చేసిన రావి నారాయణ రెడ్డిని స్ఫూర్తిగా తీసుకుని ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ ఐడబ్ల్యూ రాష్ట్ర నేత సృజన, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో అపరిచిత వ్యక్తుల సంచారం

పట్టించుకోని పోలీసులు : నరేశ్ కాలనీ అధ్యక్షుడు

బడంగ్‌పేట, జూన్ 4: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 28వ డివిజన్ శ్రీమారుతి నగర్‌లో కొన్ని రోజుల నుంచి అపరిచిత వ్యక్తులు సంచరిస్తున్నారని, ఇండ్లలో దొంగలు పడుతున్నారని మీర్‌పేట పోలీసులకు, 100కు ఫోన్ చేసినా స్పందన లేదని కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు నరేశ్ తెలిపారు. కొంత మంది చిన్న పిల్లలను ఎత్తుకెళ్లడానికి ప్రయత్నం చేస్తుంటే కాలనీవాసులు వారిని గుర్తించి వెంబడించడం జరిగిందన్నారు. అదే రోజు పోలీసుకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. కాలనీవాసులు భయాందోళనకు లోనవుతున్నారన్నారు. ఇకనైనా పోలీసులు కాలనీల్లో నిఘా పెంచాలని విజ్ఞప్తి చేశారు.

గురుకులాల సిబ్బంది సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రభుదాస్

ఆర్కేపురం, జూన్ 4: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సిబ్బంది సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా సరూర్‌నగర్ వీఎం హోం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వడ్డేపల్లి ప్రభుదాస్, కార్యదర్శిగా పి.సుధాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సిబ్బంది రాష్ట్ర కోర్ కమిటీ సమావేశం వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుదాస్ మాట్లాడుతూ.. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సిబ్బంది సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు.

కూటమి విజయంతో అభిమానుల సంబురాలు

ఎండీపీ-2-దుర్గానగర్ చౌరస్తాలో సంబురాలు నిర్వహిస్తున్న నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 4: ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్ నేతృత్వంలో కూటమి భారీ మెజార్టీతో విజయం సాధించడంతో చంద్రబాబునాయుడు అభిమానులు మంగళవారం సాయంత్రం సంబురాలు జరుపుకున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ దుర్గానగర్ చౌరస్తా వద్ద పటాకులు కాల్చడంతో పాటు మిఠాయిలు పంచిపెట్టారు. బంగారు మైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి 101 కొబ్బరికాయలు కొట్టి తమ మొక్కులను చెల్లించుకున్నారు. వెంకటేశ్, కృష్ణగౌడ్, తిరుమలవెంకటేశ్‌గౌడ్, మాధవ రెడ్డి, సుధాకర్‌గౌడ్, కాశీగారి యాదగిరి, యంజల మహేశ్, బండారి యాదగిరి, కరుణాకర్‌గౌడ్, శేఖర్‌గౌడ్, దొంత రాజు, ఉస్కె మూరు విజయ్‌కుమార్, చిర ంజీవి, ప్రభాకర్‌గౌడ్, వెంకటరమణ పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు పంపిణీకి సిద్ధం

జూబ్లీహిల్స్,జూన్4: పుస్తకాలు పంపిణీకి సిద్ధమయ్యాయి. ఖైరతాబాద్-2 మండలంలో 6 ఉన్నత పాఠశాలలు, 24 ప్రాథమిక పాఠశాలలతో పాటు 2 సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలున్నాయి. ఆయా పాఠశాలలకు 64,505 పాఠ్యపుస్తకాలు అవసరముండగా మొదటి విడుత 15,600 పుస్తకాలు, రెండో విడుత 32,175 పుస్తకాలను తరలించారు. వీటితో పాటు 10 వేల నోట్ పుస్తకాలు అందినట్లు.. తుది విడుతలో మిగతా పుస్తకాలు, నోట్‌బుక్కులు తరలిస్తామని డిప్యూటీ ఐఓఎస్ శ్రావణ్ కుమార్ తెలిపారు. ఖైరతాబాద్-2 మండలంలో పాఠ్య పుస్తకాల పంపిణీ ప్రారంభించినట్లు తెలిపారు.

బైక్, నగదు చోరీ

బంజారాహిల్స్,జూన్ 4: బైక్ నడిపిస్తూ అదుపుతప్పి కిందపడిన వ్యక్తికి చెందిన బైక్‌తో పాటు నగదు,సెల్‌ఫోన్ మాయమైన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఓల్డ్ మిర్జాల్‌గూడకు చెందిన జానకీరామ్ అనే వ్యక్తి గత నెల 24న ఇంటినుంచి తన బైక్ మీద ఆఫీసుకు బయల్దేరాడు. బంజారాహిల్స్ రోడ్ నెం 3లోని టీవీ 9 చౌరస్తా దాటగానే జానకీరామ్ కళ్లు తిరిగి బైక్‌మీద నుంచి కిందపడిపోయాడు. ఈ ఘటనలో అతడు స్వల్పంగా గాయపడటంతో పాటు స్పృహ కోల్పోయాడు. స్థానికులు అతడిని సికింద్రాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో చేర్చారు. ఆస్పత్రికి తీసుకువెళ్లే క్రమంలో అతడివద్ద ఉన్న రూ.20 వేల నగదు. సెల్‌ఫోన్ మాయమయ్యాయి. ఐదు రోజుల తర్వాత ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన జానకీరామ్ ప్రమాదం తర్వాత రోడ్డుపక్కన పార్క్ చేసిన బైక్ కోసం వచ్చి చూడగా సమీపంలో ఎక్కడా కనిపించలేదు. అన్ని ప్రాంతాల్లో గాలించినా ప్రయోజనం లేకపోవడంతో మంగళవారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన బైక్ మీద నాంపల్లిలో ట్రాఫిక్ సిగ్నల్‌వద్ద హెల్మెట్ లేకుండా ఓవ్యక్తి నడిపించడంతో గత నెల 30న చలానా పడిందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

లోక్ అదాలత్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

చర్లపల్లి, జూన్ 4 : మేడ్చల్, మల్కాజిగిరి న్యాయ సేవాధికారసంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బాల భాస్కర్, సీనియర్ సివిల్ జడ్జి, కార్యదర్శి కిరణ్‌కుమార్‌లు పేర్కొన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, తెలంగాణ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ పోస్టర్‌ను మంగళవారం కుషాయిగూడ జిల్లా కోర్టు ఆవరణలో వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాతీయ లోక్ అదాలత్‌ను ఈ నెల 8న జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమిన ల్, వాహన ప్రమాద, బ్యాంక్ రికవరీ, చెక్‌బౌన్స్, భూవివాదా ల కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సత్వర న్యాయం పొందాలని వారు సూచించారు. అధికారులు నర్సింహారెడ్డి, దేవిడ్‌రాజుతో పాటు వివిధ పోలీస్‌స్టేషన్‌లకు చెందిన కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో సౌకర్యాల కల్పన

అడిక్‌మెట్ పాఠశాలలో ఏర్పాటు చేసిన నీటి కుళాయి

- ముషీరాబాద్ పరిధిలో అమ్మ ఆదర్శ పాఠశాల పథకానికి 22 పాఠశాలలు ఎంపిక
- రూ. 1.6 కోట్లతో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

ముషీరాబాద్, జూన్ 4 : సర్కారు బడుల్లో సౌకర్యాల కల్పనకు విద్యాశాఖ అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టారు. విద్యా సంవత్సరం మొదలయ్యే నాటికి ముషీరాబాద్ మండలం పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కలిపంచడానికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసిన అధికారులు ఆ దిశగా పనులు చేపడుతున్నారు.

సౌకర్యాల కల్పనకు శ్రీకారం..

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మన బస్తీ మన బడి కథకం ద్వారా పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించగా ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట సర్కారు బడుల్లో మెరుగైన సౌకర్యాల కల్పనకు శ్రీకారం చుట్టింది.

22 పాఠశాలల ఎంపిక..

ఇందులో భాగంగా ముషీరాబాద్ మండలం పరిధిలోని ఎంపిక చేసిన పాఠశాలల్లో అవసరమైన వసతులు కల్పించే పనులు చేపడుతున్నారు. ముషీరాబాద్ మండలం పరిధిలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ప్రత్యేక అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

మండల పరిధిలోని 22 ప్రభుత్వ పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ఎంపిక చేశారు. ఐదు ఉన్నత పాఠశాలలు, 17 ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు, అధ్యాపకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి ప్రభుత్వం రూ. 1.6 కోట్ల నిధులు కేటాయించింది. ఇందులో భాగంగా తొలుత ఒక్కో పాఠశాలకు రూ రూ.40 వేల చొప్పున విడుదల చేసిన అధికారులు బడుల్లో అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నారు. ముఖ్యంగా విద్యుత్, తాగునీరు, మూత్రశాలలు, బెంచీలు వంటి సౌకర్యాలు కల్పించే పనులను చేపడుతున్నారు.

మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నాం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఇందుకోసం అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం ద్వారా ఎంపిక చేసిన 22 పాఠశాలల్లో వసతుల కల్పన కొనసాగుతున్నది. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి అన్ని ఏర్పాట్లు చేస్తాం. ఇంజినీరింగ్ విభాగం అధికారుల సమన్వయంతో పనులు చేపడుతున్నాం.

-చిరంజీవి, డిప్యూటీ డీఈఓ

యాచకురాలి మృతి

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 4: గుర్తు తెలియని యాచకురాలు మృతి చెందిన ఘటన లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకా రం.. ఈ నెల 1న మీర్జాల్‌గూడ రైల్వే క్వార్టర్స్ సమీపంలో విధులు నిర్వహిస్తున్న రైల్వే ఉద్యోగి మురళీ కృష్ణకు ఒక మృతదేహం కనిపించగా పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని, క్లూస్ టీంను సైతం పిలిపించి ఆధారాలు సేకరించారు. సమీపంలోని వారిని విచారించగా, ఆమె యాచకురాలని, రైల్వే క్వార్టర్స్ సమీపంలో ఉండేదన్నారు. ఈ క్రమంలో ఆహారం దొర క్క, అనారోగ్యంతో ఆమె మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృ తదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఇంటి ఎదుట పార్కింగ్ చేసిన వాహనం మాయం

కాచిగూడ, జూన్ 4: ఇంటి ఎదుట పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం మా యమైన ఘటన కాచిగూడ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..మోతీలాల్‌నెహ్రూనగర్‌కు చెందిన బాలరాంచౌదరి ప్రైవేటు ఉద్యోగి. 1వ తేదీ రాత్రి ఇంటి ఎదుట ఏపీ 11 ఏజే 3530 నంబర్ అక్టీవాను పార్కింగ్ చేశాడు. మరుసటి రోజు చూసేసరికి కనబడలేదు. మంగళవారం కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో అతను ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

బీజేపీ శ్రేణుల గెలుపు సంబురాలు

మణికొండ, జూన్ 4 : రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని గండిపేట మండలంలో బీజేపీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. మంగళవారం వెలువడిన లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో చేవెళ్ల పార్లమెంటు ఎంపీగా బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి భారీ మెజార్టీ నమోదు చేసుకోవడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సంబురాలను జరుపుకున్నారు. మోదీ మానియాతో భారీ మెజార్టీ వచ్చిందని రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి అంజన్‌కుమార్‌గౌడ్, మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, జిల్లా ఓబీసీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అన్నారు. ఈ సందర్భంగా మణికొండ మర్రిచెట్టు సమీపంలో పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. వట్టినాగులపల్లి, ఖానాపూర్, కోకాపేట, నార్సింగి, మంచిరేవుల గ్రామాల్లో బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున సంబురాలను జరుపుకున్నారు.

రాజేంద్రనగర్‌లో..

బండ్లగూడ: చేవేళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడంతో బీజేపీ నాయకులు సంబురాలను జరుపుకున్నారు. రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు బాబురావు ఆధ్వర్యంలో నాయకులు అంబేద్కర్ విగ్రహం వద్ద మిఠాయిలు పంచుకుని సంబురాలు చేసుకున్నారు. జై బీజేపీ అంటు నినాదాలు చేశారు. బండ్లగూడ అరె మైసమ్మ దేవాలయం వద్ద కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.అనంతరం మహేశ్ యాదవ్ ఆధ్వర్యంలో మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో బీజేపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్,జిల్లా మోర్చా కార్యదర్శి కోరని క్రాంతి, నాయకులు శ్రీనివాస్ గౌడ్,రవీందర్,పవన్‌రాజ్,మల్లేశ్,వేణు,రఘు మారెడ్డి,స్వామి,పెంటయ్య,లక్ష్మీనారాయణ,అరుణ్,మహలింగంగౌడ్,మల్లారెడ్డి,నరేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

మైలార్‌దేవ్‌పల్లి లో...

మైలార్‌దేవ్‌పల్లి: చేవెళ్ల గడ్డపై కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సాధించిన విజయం ప్రజల గెలుపు అని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల పార్లమెంటు ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుపొందిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో ఆయన పాల్గొని సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అడికే జనార్దన్, రావుల భాస్కర్, ఎన్ను శ్రీనివాస్‌రెడ్డి, మజర్, శివ, బబ్లు, జబ్బర్ పాషా, గణేశ్, అనీశ్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శంషాబాద్ పట్టణంలో...

శంషాబాద్ రూరల్: చేవెళ్ల ఎంపీగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందారు. దీంతో పార్టీ నాయకులు శంషాబాద్ పట్టణంలో పటాకులు కాల్చుతూ స్వీట్లు పంచుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి మద్దతుగా చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించిన ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధి చేస్తారని వివరించారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపు అభివృద్ధికి మలుపు అని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నందకిశోర్,పరమేశ్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, రాజిరెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.


విశ్వేశ్వర్‌రెడ్డికి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

రాజేంద్రనగర్‌లో సంబురాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు

మణికొండ మున్సిపాలిటీ మర్రిచెట్టు సమీపంలో సంబురాల్లో పాల్గొన్న బీజేపీ నేతలు

అలరిస్తున్న ఇన్‌ఫాంట్ హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్

మెహిదీపట్నం, జూన్ 4 : వేసవి సాయంత్రం వేళల్లో ప్రజలు ఆహ్లాదాన్ని పొందడానికి తమ ప్రాంతంలో చూడదగిన ప్రదేశాలకు వెళుతుంటారు. కొందరు ఎంటర్‌టైన్‌మెంట్ అందించే ప్రాంతాలకు వెళ్లాలని అనుకుంటారు. అలాంటి వారి కోసం కార్వాన్ నియోజకవర్గం లంగర్‌హౌస్ సంగం సమీపంలో ఇన్‌ఫాంట్ హ్యాండ్లూమ్ హాండీక్రాఫ్ట్ ఎగ్జిబిషన్ ఏర్పాటు అయ్యింది.

ఆకర్షణీయంగా.. ఆకట్టుకునేలా..

ఆకర్షణీయంగా రూపొందించిన ఎగ్జిబిషన్ సందర్శకులను ఆకట్టుకుంటున్నది. అమెరికాలోని వైట్‌హౌస్ నమూనాతో రూపొందించిన ఈ ఎగ్జిబిషన్‌లోని జాయింట్ వీల్ ప్రజలకు ఎంటర్‌టైన్‌మెంట్ అందిస్తున్నది. ఆలోచింప చేసే విధంగా ప్రదర్శనల ఏర్పాటు పాటుగా.. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత మన సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రాబ్సన్ తెలిపారు. సందర్శకులకు పోటీలను నిర్వహించి బహుమతులు ఇస్తున్నామని పేర్కొన్నారు.